అందరిలాగానే మేము అయిదో ఏట స్కూల్లో చేరాము. స్కూలుకు వెళ్లడానికి సిద్ధమైన మమ్మల్ని చూసి మా నాన్న అమ్మతో— "ఎన్నిసార్లు చెప్పాను వాళ్లకు ఒక మాదిరి బట్టలు వెయ్యవద్దని? స్కూల్లో వాళ్లకు ఎట్లా గుర్తు తెలుస్తారు వీళ్లు?" అన్నారు.

మా అమ్మ మమ్మల్నిద్దరిని దగ్గర చేర్చుకుని ముద్దు పెట్టుకుని, "మన పిల్లలకు ఊళ్లో వాళ్ల దృష్టి కాదు, ముందు మీ దృష్టే తగులుతుంది. ఎంత ముద్దుగా ఉన్నారు! తీసుకు వెళ్లండి" అంది. మమ్మల్ని చూసి స్కూల్లో చాలామంది నిర్ఘాంతపోయారు. మా హెడ్‌మిస్ట్రెస్ ఇంకో టీచరుతో—"వీళ్లు తప్పకుండా ఐడెంటికల్ ట్విన్స్" అంది. ఆమె మమ్మల్ని తిట్టిందో, పొగిడిందో నాకు తెలియలేదు. ఆడుకునేటప్పుడు చాలా సార్లు తక్కిన పిల్లలు లలితను లతా అని, నన్ను లలితా అని పిలిచేవారు. అట్లాంటి పొరపాటు జరిగినప్పుడల్లా లలితకు చాలా సరదాగా ఉండేది. చాలా గర్వంగా పకపకా నవ్వేది. నాకు కోపం, ఏడుపు వచ్చేవి. "ఎన్ని సార్లు చెప్పాను నా పేరు లతని? లలితంటావేం? గుర్తించుకోలేవూ" అని పోట్లాటకు సిద్ధమయేదాన్ని. ఒక రోజు హఠాత్తుగా నాకు, లలితకు భేదం కనపరచాలన్న తహతహ కలిగింది. మరునాడు స్కూలు కెళ్లేటప్పుడు లలిత వేసుకున్న నీలం రంగు గౌను చూసి, "అమ్మా! నేను పచ్చగౌను వేసుకుంటాను" అన్నాను. అమ్మ— "పచ్చగౌన్లు రేపు వేసుకుందురు గానిలే. లలితను డ్రెస్ చేసేశానుగా మరి" అంటూ నాకు నీలం గౌను తొడిగింది. సరిగ్గా స్కూలు కెళ్లే ముందు మంచినీళ్లు తాగే మిషతో చెంబ్యు జార్చి గౌను తడుపుకున్నాను. అమ్మ నా తలమీద చిన్నగా మొట్టి, "వెధవ మొండిపట్టా, నువ్వూనూ" అని విసుక్కుని నాకు పచ్చగౌను తొడిగి, లలితకుకూడా డ్రెస్సు మార్చి పచ్చగౌను తొడిగింది. నేను ఆ వేళ క్లాసులో ఒక పాఠం సరిగా వినలేదు. మధ్యాహ్నం బ్లేడు తీసుకుని గౌను కత్తిరించుకున్నాను. ఇంట్లో కెళ్లగానే— "కొత్త గౌను కోరి వేసుకున్నావు పొద్దుట— కత్తిరించి నట్లు అట్లా ఎట్లా చింపుకు వచ్చావు" అంది అమ్మ. "కంచెముల్లు తగిలిం" దన్నాను. "అంత ఒళ్లు పై తెలియకుండా ఆటలేమిటి" అని కోప్పడింది. మరునాడు నా చిరిగిన గౌనుతోపాటూ లలిత గౌనుకూడా పనిమనిషి కూతురు కొకటీ, పాలవాడి కూతురు కొకటీ ఇచ్చేసింది అమ్మ. మరునాడు జడ వేస్తూండగా— "నాకు ఒక జడ వెయ్యమ్మా" అన్నాను. "లలితకు రెండు జడలు వేశానుగా మరి. వచ్చే నెల్లో మల్లెపూలు వస్తాయిగా— అప్పుడు ఒక జడ వేసి పూలు కుడతాను, సరా?" అంది. నాకు ఏడుపు వచ్చింది. "లలితకు రెండు జడలు వేస్తే నాకు ఒక జడ ఎందుకు వెయ్యకూడ" దన్నాను, ధైర్యం చేసి. మా అమ్మ— "తప్పు, లతా, అట్లా అనకూడదు. మీరు పుట్టి నప్పుడు డాక్టరుగారు వెయ్యి మందిలో ఒకరుకూడా మీ లాంటి కవల పిల్లలుండరన్నారు. మీ రిద్దరూ ఒక లాగా ఉండి స్నేహంగా ఆడుకోవాలి" అంది. "మా లాంటి వా శ్లైవరన్నా తెలుసా, అమ్మా, నీకు" అనడిగాను. "నాకు తెలియదమ్మా. మగపిల్లలు కవలలైతే రామ లక్ష్మణులని పేర్లు పెట్టుకుంటారు. మద్రాసులో ముదలియార్ సోదరులు పెద్ద పేరు తెచ్చుకున్న కవలలు. ఒకాయన లాయరు, ఇంకొకరు డాక్టరు" అంది. వెల్లువలో పూచికపుల్ల దొరికినట్లయింది నాకు. పేపరు చదువుకుంటున్న నాన్న అమ్మతో— "పద్మా! రామలక్ష్మణులు కవలలు కారు. సుమిత్ర నీ కన్నా తెలివైనది. తన కవల పిల్లల్ని వేరు చేసి ఒకరిని రాముడితో, ఇంకొకడిని భరతుడితో జట్టు కలిపింది" అన్నారు. "మీ ప్లీడరు కబుర్లు నాకు చెప్పకండి" అంది అమ్మ. నాన్న ఏమి మాట్లాడినా సగమే నా కర్థమయ్యేది.

మరునాడు స్కూలు చేరిన తరవాత రెండు జడలు విప్పేసి ఒక జడ అల్లుకున్నాను. "అదేమిటి?" అంది లలిత. "నా ఇష్టం" అన్నాను నేను. కోపం వచ్చిన లలిత తనుకూడా జడలు విప్పి ఒక జడ అల్లుకుంది. "అదేమి" టన్నాను నేను. "నా ఇష్టం" అంది లలిత. అమ్మ, లలిత మహా బలవంతులు. వాళ్ల ముందు నాన్నగారే ఏమీ చెయ్యలేరు కదా— నే నేం చెయ్యగలను? ఆఖరి ప్రయత్నంగా ఒక రోజు ఎవరూ చూడకుండా ఒక ముల్లు తీసుకుని ముఖానగాటు పెట్టుకుందామనుకున్నాను. కాస్త రక్తం చిమ్మగానే భయమేసి ముల్లు పారేసి ఇంట్లోకి పరుగెత్తాను. అమ్మ మందు రాసింది. నాన్న ఇంటికి వచ్చిన తరవాత— "క్రిందా మీదా తెలియకుండా పరుగెత్తుతుందిగా— ఏ గాజుపెంకో గీసుకుంది. నయం కన్ను దగ్గర కాదు" అంటూ ఫిర్యాదు చేసింది. నాలుగు రోజులకు దెబ్బ మానింది. నెల రోజులకు చర్మం కలిసిపోయింది. 'కాస్త నెప్పికే భయపడిపోయాను. నా మొద్దు ముఖానికి గీతలు వాతలు రమ్మంటే ఎట్లా వస్తాయి?' అని నన్ను నేనే తిట్టుకున్నాను. పరిస్థితులతో రాజీ పడక తప్పింది కాదు. హైస్కూలు జీవితమంతా అట్లాగే గడిచింది. కాలేజీలో చేరగానే లలిత ఆర్ట్స్ గ్రూపు తీసుకోవడం చూసి నేను సైన్సు గ్రూపు తీసుకున్నాను. కాని, కాలేజీలో ఇంకో విచిత్రం జరిగింది. అందరూ మమ్మల్ని హిస్టరీ లలిత, సైన్సు లలిత అని పిలవడం మొదలు పెట్టారు. పి.యు.సి.లో ఫస్టుక్లాసు తెచ్చుకున్నాను. ముదలియార్ సోదరుల కథ మరిచిపోలేదు నేను. నాన్నతో మెడిసిన్‌కి వెళతానని చెప్పాను. చాలా సంతోషించారు నాన్న.

సరిగా అప్పుడే నాన్న స్నేహితులు నరసింహంగారు ఏదో పనిమీద మా ఊరు వచ్చి మా ఇంట్లో బస చేశారు. ఆయన కొడుకు మరునటి నెలలో అమెరికా నుంచి వస్తున్నట్లు చెప్పారు. ఆయన ఊరెళ్లిన తరవాత నాన్నకు— "మా మోహన్ రెండు నెలల సెలవు మీద వస్తున్నాడు. లతనైనా సరే, లలితనైనా సరే మా వాడి కిష్టమంటే, మోహన్ రాగానే పిల్లను చూడ్డానికి పంపిస్తాను" అని ఉత్తరం వ్రాశారు. "మరీ చిన్నవాళ్లు— ఇప్పుడే పెళ్లేమి" టని నాన్నగా రనడం, "కాళ్ల దగ్గరకు వచ్చిన సంబంధం కాశీ కెళ్లినా రా"దని అమ్మ అనడం వినపడింది నాకు. ఒక రాత్రి— నాకు చదువూ వద్దూ, పాడూ వద్దూ. కొత్త దేశంలో, కొత్త మనుష్యుల మధ్య లలితకు దూరంగా నేనుగా, నేను నేనుగా బ్రతకాలని సరదా పడ్డాను. మరునాడు నాన్న నన్ను దగ్గరకు పిలిచి, "లతా! నరసింహంగా రబ్బాయి సంబంధం వచ్చింది. వాళ్లు మీ ఇద్దరిలో ఎవరినైనా సరే నన్నారు. లలిత ఇంకో మూడేళ్లకు డిగ్రీ తీసుకుని, తరవాత రెండేళ్లకు ఇంకో డిగ్రీ తీసుకున్నా ట్యూటర్ ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకంకూడా లేదు. నువ్వు మెడిసిన్‌కి వెళతా నన్నావు. పెళ్లి కోసం నీ చదువు, భవిష్యత్తు చెడగొట్టడం నా కిష్టం లేదు. కనక ఈ సంబంధానికి లలితనివ్వాలనుకుంటున్నాం. నువ్వే మంటావు?" అన్నారు. ఒక్క క్షణం ఆశ పడ్డానో లేదో, అంతలో గద్దలాగా తరుముకు వచ్చింది లలిత. తేరుకుని, "అవును నాన్నా, వారం క్రిందట మెడిసిన్‌కి వెళతానని చెప్పి, ఈవేళ మీరు కుదిరిస్తే మాత్రం నేను పెళ్లికి ఎట్లా ఒప్పుకుంటా ననుకున్నారు" అన్నాను.

మేలో లలిత పెళ్లయింది. 'మోహన్— సుమారుగా ఉన్నాడు. పెద్ద అందగాడేమీ కాదు' అనుకున్నాను. 'అంత ఎరుపేమీ కాదు, కాస్త నలుపే' అనుకున్నాను. 'డాక్టరు లత, మిసెస్ మోహన్ ఇక చస్తే మా పేర్లు కలిసిపోవు' అనుకున్నాను. నేను చదువులో పడ్డాను. లలిత క్లీవ్‌లాండ్ వెళ్లాక మొదట్లో

పొలంనుంచి

చిత్రం—హిమ (ఖమ్మం)







—విజయలక్ష్మీ రామకృష్ణన్


వారానికి మూడు ఉత్తరాలు వ్రాసేది. తరవాత వారాని కోసారి, తరవాత నెల కో ఉత్తరం వస్తుండేవి. ఇద్దరు అమెరికన్ పిల్లలకు తల్లిఅయింది లలిత. అమ్మకు ఎప్పుడూ లలిత గురించిన బెంగే! ఇద్దరు పిల్లలు, వండుకోవడం, కడుక్కోవడం పనంతా ఒంటరిగా ఎట్లా చేసుకుంటుందో అని వాపోయేది. చిన్నబ్బాయి పుట్టాక ఉత్తరం వ్రాస్తూ, "అమ్మా! పెద్ద బాబుకు నాన్న పేరు కలిసేలాగా పెట్టుకున్నాం కదా— చినబాబుకు నీ పేరు కలిసేలాగా ప్రభాకర్ అని పిలుస్తున్నాం" అని వ్రాసింది. అమ్మ మహా పొంగిపోయింది. సుబ్బారావుకు సుధాకర్‌కు, పద్మావతికి ప్రభాకర్‌కు పేర్లు ఎట్లా కలిశాయో నా కర్థం కాలేదు. ఖుషీ పూసి మారేడు కాయ చెయ్యడమంటే మా లలితనే ముందు చెప్పుకోవాలి.

మెడిసిన్ చదువు మూడేళ్లు దాటింది నాకు. ఉన్నట్లుండి ఇంట్లో వాతావరణం మారిపోయింది. అమ్మ వంట చెయ్యడం మానేసింది. కళ్లవాపు, ముఖం పొంగు, ఎన్నడూ లేని నీరసం— అమ్మకు అకస్మాత్తుగా అంత అనారోగ్యమేమిటో అర్థం కాలేదు నాకు. చెకప్‌కు హాస్పిటల్‌కు రమ్మంటే— "నాకు డాక్టరంటే భయం. ఇంజెక్షన్లంటే భయం. రాను, పో"మ్మంది. నాన్న అమ్మను బలవంతం చెయ్యకపోవడం చూసి ఇంకా ఆశ్చర్యపోయాను. ఒక అర్ధరాత్రి కలతనిద్రలో ఏవో మాటలు వినిపించి లేచాను. నాన్న ఫోనుతో మాట్లాడ్డం చూసి మెల్లిగా లేచి వెళ్లి పొంచి విన్నాను. "లేదు, నరసింహం, నే నీ సంగతి లతతో చెప్పనేలేదు. చెప్పదలుచుకోలేదు. అర్థం చేసుకో. నన్ను బలవంత పెట్టకు" అని ఫోను పెట్టేశారు. వెళ్లి పడుకుని ఆలోచించాను. 'ఏమై ఉంటుంది? నరసింహంగారు నాకేమైనా సంబంధం తెచ్చారా? ఉత్తరం వ్రాయచ్చుగా— అర్ధరాత్రి ట్రంక్‌కాల్ దేనికి? నాన్న గొంతు వణకడం స్పష్టంగా వినపడింది నాకు. ఏదో జరిగింది. ఏదో జరుగుతూంది. అమ్మా, నాన్నా నాకు తెలియకుండా దాచిపెడుతున్నారు' అనుకున్నాను. మరునాడు ఎవరూ లేకుండా చూసి నరసింహంగారికి ఫోను చేశాను. మూడు నెలలుగా లలితకు జబ్బుగా ఉందట. కిడ్నీలు చెడిపోయినవట. లలితకు ఐడెంటికల్ ట్విన్ సోదరి ఉందని తెలిసిన డాక్టరు ఒక కిడ్నీ లలితకు ఇవ్వడానికి నేను సిద్ధపడతానేమో కనుక్కోమన్నాడట. అవును మరి, మా ఇద్దరి జెనిటిక్స్ ఒక్కటే కనక ట్రాన్స్‌ప్లాంట్ రిజెక్టు అయ్యే అవకాశం తక్కువ. "బాగా ఆలోచించు, లతా! చెయ్యగలిగితే ఇంతకన్నా మహత్కార్యం ఉండదు" అన్నారు నరసింహంగారు. అవును మరి, నేను ఆయన కూతుర్ని కాదుగా!

మరునాడు టీకాలు వేయించుకుని, కలరా ఇంజెక్షను తీసుకుని ఇంటికి వచ్చే వరకూ నా అమెరికా ప్రయాణం సంగతి అమ్మకు, నాన్నకు తెలియదు. "నువ్వు అనుకున్న పని చేసెయ్యడమేనా, నాతో చెప్పక్కరలేదా?" అన్నారు నాన్న. "నెల రోజులుగా మీకు తెలిసిన సంగతి నాకు రహస్యంగా ఉంచారు కదా— నే నెందుకు ప్రతి విషయం మీకు చెప్పాలి" అన్నాను నేను. అమ్మ ఏడుస్తూ— "లతా! లలిత సంగతి గుండె రాయి చేసుకున్నాం. మా దుఃఖం చూడలేక ను వ్వింత త్యాగం చెయ్యవ"ద్దంది. నేను— "కోటి కష్టాలు తెచ్చుకునైనా మిమ్మల్ని సుఖపెడతాననేటంత మంచి కూతుర్ని కాను నేను. నరసింహంగారు, ఆయన కొడుకు బొత్తిగా పరాయి వాళ్లు నాకు. లలితంటే ఒలికిపోయేంత ఆపేక్ష నా కెప్పుడూ లేదని మీకు తెలుసు. నే నీ నిర్ణయానికి వచ్చింది మీ కోసం కాదు, లలిత కోసం కాదు. అమ్మా, నాన్నా! నమ్మండి నన్ను. నా కోసం, నా తృప్తి కోసం" అన్నాను. పది రోజులకు పాస్‌పోర్టు, వీసాలు రావడం, నేను ప్లేను ఎక్కడం అయింది.

క్లీవ్‌లాండ్ ఎయిర్‌పోర్టుకి మోహన్ వచ్చాడు. కారెక్కి కూర్చున్న తరవాత స్టార్టు చెయ్యకుండా— "లతా! ఇంటికెళ్లేముందు ఒక్క మాట విను. నిన్ను చూడ్డానికే సిగ్గుగా ఉంది నాకు. ఎవరికో ఒకరికి చెప్పుకోవాలనిపించి నాన్నకు భారతమంత ఉత్తరం వ్రాశాను. మిమ్మల్ని ఈ పనికి ఒప్పించమని మాత్రం నాన్నకు నేను వ్రాయలేదు. నమ్మండినామాట" అన్నాడు. "మోహన్, లలిత గురించి మనమంతా బెంగపడవలసిన సమయంలో నా గురించి బెంగపడకండి మీరు" అన్నాను. ఇంటికెళ్లి స్నానం చేసి తన చేతి వంట తింటేనేగాని హాస్పిటల్‌కు తీసుకెళ్లనన్నాడు. ఇంటికెళ్లాక "పిల్లలేరి?" అన్నాను. "స్నేహితులింట్లో ఉంటున్నా"రన్నాడు. హాస్పిటల్‌కు వెళ్లాను. లలిత పక్కమీద ఏకులాగా పడుకునుంది. మెడికల్ కాలేజీలో చేరేవరకు ఇంట్లో ఎవరికైనా కాస్త జబ్బు చేస్తే నాకు ఒళ్లు మండుకు వచ్చేది. 'తిరి కూర్చుని ఏవో ఒకటి తెచ్చుకుంటారు, తక్కిన వాళ్ల ప్రాణాలు తియ్యడానికి' అనుకునే





దాన్ని. నిజం, లతా, నే నెప్పుడూ పడక పెట్టలేదు. ఆ రోజు లలితను చూసేటప్పటికి భయంతో బిగుసుకు పోయాను. లలిత నవ్వుతూ—"వచ్చావా—రా, లతా" అంది. మనిషి బక్కచిక్కినా, మాట బలంగానే ఉంది. మోహన్ బయటి కెళ్ళిపోయాడు.

లలిత హఠాత్తుగా — "లతా! ఒక నిజం చెపుతాను నీకు! విన్నాక క్షమించు నన్ను" అంది. "ఏమి"టన్నాను. "మీ బావకు, నాకు ఒక దురలవాటుంది. మాకు వచ్చిన ఉత్తరాలు, మేము వ్రాసిన ఉత్తరాలుకూడా ఇద్దరం చదవడం." 'ఎంత చక్కని దాంపత్యం వీళ్ళది! లలిత చచ్చిపోకూడదు' అనుకున్నాను. "వాళ్ల నాన్నకు వ్రాసిన ఉత్తరం చదివాక ఏమనుకున్నారో ఏమో మీ బావ— 'డాక్టరన్న ప్రతి మాట వ్రాసి ఉండకూడదు నేను. లతా! మీ అమ్మా, నాన్నగారూ అంతా అపార్థం చేసుకోగలరు నన్ను' అన్నారు. 'ఫర్వా లేదు— ఈ జాబు చూచి మా లతేమీ పరుగెత్తి రాదు మీరు భయపడ్డానికి' అన్నాను. నిజం, లతా, నే నెప్పుడూ అనుకోలేదు నువ్వు నా కోసం ఇంత ఫీలవుతావని. ఇతరులను దొంగతనంగా పరీక్ష చెయ్యడం చిన్నప్పటినుంచి దురలవాటయింది నాకు. లతా, నువ్వు వస్తున్నట్లు కేబిల్ వచ్చిననాడు నేను, మీ బావ ఎంత సిగ్గు పడిపోయామో ఎట్లా చెప్పను?" అని వెక్కి వెక్కి ఏడ్చింది.

లలితను ఎట్లా సముదాయించాలో తెలియ లేదు నాకు. తేరుకుని— "లలితా! నువ్వు ఇంత సిగ్గు పడిపోనక్కర లేదు. నా సంగతి చెపుతా విను. ప్లేనులో కూర్చుని వస్తూంటే ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలు. ఒక క్షణం నీ చోటులో నేను నిలుచుని, నా చోటులో నిన్ను నిలబెట్టి ఆలోచించాను. లలితా! నాకే ప్రాణం మీదికి వస్తే, నీ కిష్టీ సంగతి దేవు డెరుగు, నీ దగ్గర బొన్నుడు రక్తం కూడా తీసుకోవడానికి నేను ఒప్పుకునే దాన్ని కాదు. నీ బుద్ధి గొప్పది, లలితా. అందుకే నన్ను స్వీకరించగలిగావు. నే నెప్పుడూ బీదదాన్నే" అన్నాను. అప్పటికే చాలాఆలస్యమయిందంటూ ఆమరునాటికే సర్జరీకి ఏర్పాట్లు చేశారు డాక్టర్లు. నన్ను హాస్పిటల్లోనే ఉంచి టెస్టులు మొదలుపెట్టారు. నన్ను ఇంటికి పంప కుండా ఇంకో గదిలో హాస్పిటల్లోనే పడుకోమన్నారు. మోహన్ క్లీవ్‌లాండ్‌లో మేమున్న హాస్పిటల్లోనే కార్డియాలజీ అసిస్టెంటు.

రాత్రంతా నిద్ర లేదు. ఏదో భయం. తెల్లవారి ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు. ఆరు గంటలకు నర్సు వచ్చి నిద్ర లేపింది. గాభరాగా లేచి, "సర్జరీ పదింటికి కదా" అన్నాను. నర్సు గదిలో ఉన్న, ఛార్ట్సు అన్ని తీసివేస్తూ, "సర్జరీ కాన్సిలయింది" అన్నది. తెల్లబోయి "ఆదేమి"టన్నాను. నర్సు నన్ను చూడ కుండానే— "అయామ్ సారీ. అంతా మీ సిస్టర్ గదిలో ఉన్నారు. పదండి, అక్కడకు" అంది. 'ఓ, నో! ఓ, నో!' అనుకుంటూ లలిత గదిలోకి పరుగెత్తాను. మోహన్ చుట్టూ మూగి ఉన్నారు డాక్టర్లు. లలితకు ముఖం కనపడకుండా దుప్పటి కప్పారు. నా చేతులు తన చేతుల్లోకి తీసుకుని ఛీఫ్ సర్జన్ డాక్టర్ థామస్—"చాలా బలహీనస్థితిలో మిమ్మల్ని చూసిన సంతోషానికి, మళ్లీ బ్రతుకుతానన్న ఉత్సాహానికి తట్టుకో లేకపోయారు మిసెస్ మోహన్" అన్నారు. 'ఛస్తే నీ రక్తం తీసుకోను' అన్న నా మాట నాకే తిప్పికొట్టింది లలిత. ఇందుకా నేను రెక్కలు కట్టుకుని ఇంత దూరం వచ్చాను?

లలిత పిల్లలిద్దరూ నన్ను చూడగానే 'అమ్మా' అంటూ హత్తుకుపోయారు. పెద్దవాడు "నీకు బాగుందా, అమ్మా? ఎప్పుడు వచ్చావు హాస్పిటల్‌నుంచి? డాడీ ఎందుకు అట్లా ఉన్నారమ్మా" అన్నాడు. నేను ఏడుస్తూ— "మీ అమ్మ లేదురా. చచ్చిపోయింది" అన్నాను. ప్రభాకర్— "నీ కెప్పుడు కోపం వచ్చినా అట్లాగే అంటావు. నే నేం తప్పు చెయ్యలేదుగా ఇప్పుడు?" అన్నాడు. ఏం మాట్లాడేది వాళ్లతో! పిల్లలు నిద్ర పోయాక— "మోహన్! ఇంటికి కేబిల్ ఇచ్చారా? పిల్లలను నాతో పంపేటట్లయితే పాస్ పోర్టుల కోసం అప్లయి చెయ్యండి" అన్నాను.

ఎదురువచ్చిన అమ్మతో — "లలిత కోసం వెళ్లి వీళ్లను తీసుకువచ్చా" నంటూ ఏడ్చాను. నాన్న నా దగ్గరకు వచ్చి, "ఏడవకు, లతా, ఏదీ మన చేతుల్లో లేదు" అన్నారు. నాన్నకు లలిత పోయిందన్న దుఃఖం ఎక్కువో, నేను చెక్కు చెదరకుండా వచ్చానన్న సంతోషం ఎక్కువో నాకు తెలియ లేదు. అమ్మ గురించి ఎంత భయ పడ్డానో! నెల తిరక్కుండా తేరుకుంది. పూర్వం లతా, లలితా అంటూ మా వెనక తిరిగే అమ్మ పొద్దస్తమానం "ప్రభా, సుధా" అంటూ పిల్లల వెనక తిరిగింది. మగపిల్లలు ఎదురుతిరుగుతా రన్న భయం లేకపోతే మనుమళ్లిద్దరికీ ఒకే రకం గౌన్లు కుట్టించేదే అమ్మ!


"ఆలిండియా మెడికల్ కాంగ్రెసు ఈ ఏడాది మద్రాసులో జరుగుతున్నది కనక మేలో వస్తే కాంగ్రెసుకు హాజరవు తా"నని మోహన్ వాళ్ల నాన్నకు, మా నాన్నకు జాబులు వ్రాశాడు. బొంబాయి నుంచి సరాసరి మా ఇంటికే వచ్చాడు మోహన్. పిల్లలు మా ఇంట్లో ఉన్నారుగా మరి? తాను రెండు పేపర్లు కాంగ్రెసులో చదవబోతున్నట్లు చెప్పాడు. ఆ పేపర్ల గురించి మాట్లాడాడు భోజనాల దగ్గర. రాత్రి పడుకోవడానికి వెళ్లే ముందు పేపర్ల కాపీలు నా కిచ్చాడు చదవమని.

మరునాడు కాఫీలు తాగేటప్పుడు— "నాకు కూడా కాంగ్రెసుకు వెళ్లాలనుంది, నాన్నా" అన్నాను. "గుడ్! వెళ్లిరా. లతను నీతో తీసుకెళ్ళు, మోహన్" అన్నారు నాన్న.

కాంగ్రెసులో మోహన్ పేపర్లు చాలా మందికి నచ్చాయి. పెద్ద పెద్ద డాక్టర్లంతా మోహన్ చుట్టూ మూగడం, తన కోసం వేచి ఉన్న నన్ను దగ్గరకు పిలిచి ఆ ప్రొఫెసర్లకు, డాక్టర్లకు "మా కజిన్, లత. డాక్టరు కాబోతోంది" అంటూ మోహన్ నన్ను పరిచయం చెయ్యడం కొత్త అనుభవం నాకు. చర్చలలో పాల్గొన్న మోహన్‌ను పరీక్షగా చూశాను. 'ఆ గొంతు చూడు కంచు లాగా' అనుకున్నాను. 'పూర్వం నలుపను కున్నాను కాని, ఇప్పుడు కాస్త రంగు వచ్చాడు' అనుకున్నాను.

తిరిగి వచ్చేటప్పుడు కంపార్ట్‌మెంటులో ఇద్దరమే ఉన్నాం. నా కేదో భయం, దుఃఖం గొంతు వరకు నిండింది. నా సంగతి ఏమీ పట్టనట్టుగా పేపరు చదువుకుంటున్నాడు మోహన్. పెగుల్చుకుని— "ఏమైనా మాట్లాడండి, మోహన్" అన్నాను. మోహన్ ఒక క్షణం తెల్లబోయి పేపరు పక్కన పడేసి, "లతా! బాబు లిద్దరూ బాగా విసిగిస్తుంటారా నిన్ను, మీ మదర్‌ను" అన్నాడు. నవ్వు వచ్చింది నాకు. మెడికల్ కాంగ్రెసులో మాటలు తడుముకోని మోహన్‌కు నాతో మాట్లాడ్డానికి మాట దొరకడం లేదు. "మోహన్! మళ్లీ అమెరికా వెళ్లాలిసిందేనా మీరు? ఎప్పటికీ అక్కడే ఉండి పోతారా" అన్నాను. సిగ్గు, సిగ్గు— నా గొంతు బొంగురు పోయింది. మోహన్ బదులు చెప్పలేదు. అతని ముఖంలో రంగులు మారాయో లేదో నాకు తెలియదు. నేను చూస్తే కదా! పది నిమిషాల తరవాత— "లతా! నిజం చెప్పు, జాలి తలుస్తున్నావా నన్ను" అన్నాడు. "జాలి సంగతి నిజమే కాని, అది మీ మీదా, మీ పిల్లలమీదా కాదు. నమ్మండి నా మాట" అన్నాను. "మరి?" అన్నాడు మోహన్. "చచ్చిపోయి మిమ్మల్ని పొగొట్టుకున్న మా లలితమీద నా జాలంతా" అన్నాను. మోహన్ పకపక నవ్వుతూ, "లతా! లలితకూడా నన్నింతగా పొగడలేదెప్పుడూ" అన్నాడు. "లలితకు మీరు పరాయి వాళ్లయితేగా పొగడాలిసిన ఖర్మ" అన్నాను. "పొగడ్తలు వినాలంటే మహా కష్టం నాకు" అన్నాడుమోహన్. 'మానెయ్యండి' అన్నాను నేను. మోహన్ లేచి నా దగ్గరగా వచ్చి, "లతా! తొందర పడకు. బంగారం లాంటి భవిష్యత్తు నీది. పరిస్థితులతో రాజీపడవలసిన అవసరం నీ కేమీ లేదు" అన్నాడు. "ఇష్టం లేకపోతే సూటిగా చెప్పవచ్చు" అన్నాను. "నీ బేలతనాన్ని ఉపయోగించుకోవడం ఇష్టం లేదు నాకు. వచ్చే ఏడాది మళ్లీ ఇండియా వస్తాను. నీ మనస్సు మారకపోతే మాట్లాడుకుందాం" అన్నాడు. "ఈవేళ ఒక మనసు, రేపు ఒక మనసుకు— నే నేమీ పసిపిల్లను కాను. బుద్ధి తక్కువై వచ్చాను మెడికల్ కాంగ్రెసుకు. మీ దోవన మీ రెళ్లిపోతే, ఇహ నా చదువు సాగదు" అన్నాను. "ఓకే, ఓకే! ఇహ ఆపు, లతా, నీ మాటలు వింటూగా" అన్నాడు మోహన్. "ఇప్పు డెవరికి ఎవరి మీద జాలి" అన్నాను నేను. ఆ పైన మాట్లాడనియ్యలేదు మోహన్.

పది రోజుల్లో ముహూర్తం పెట్టారు. తిరుపతిలో అయింది మా పెళ్లి. మోహన్ సెలవు అయిపోయినందున క్లీవ్‌లాండ్ వెళ్లిపోయాడు. వారానికి రెండు ఉత్తరాలు. నాకు పేరూ ఊరూ లేనట్టు మిసెస్ మోహన్ అని అడ్రెసు వ్రాస్తాడు. చదువులో నా కెట్లా తీరుతుంది కట్టలు కట్టలు చెత్త కబుర్లు వ్రాయడానికి? ఇంకో మూడు నెలల్లో నా హౌస్ సర్జన్ గడువు అయిపోతుంది. మోహన్ పెట్టెలు సర్దుకుని శాశ్వతంగా వచ్చేస్తున్నాడు ఇండియాకు. అమెరికాకు వెళ్లి వాళ్ల నాన్నకు డబ్బు పంపాడు. ఇద్దరం కలిసి ప్రాక్టీసు పెట్టుకోవడానికి నర్సింగ్ హోమ్ కట్టిస్తున్నారు నరసింహంగారు. బాబు లిద్దరూ నన్ను పిలిచినప్పుడల్లా— "అమ్మా కాదు, పిన్నీ కాదు, అన్నీ ఏమిటట్రా" అని విసుక్కుంటుంటాను. నేను, నేను అని కొట్టుకున్నానే కాని, ఇంకా నే నెక్కడున్నాను? ఎప్పుడో చచ్చిపోయాను నేను. విచిత్రం— లలిత ఇంకా బ్రతికే ఉంది! *


1973 ఫలితాలు

ఏదైన ఒక పువ్వు పేరు లేదా అక్షరం పేరు, వ్రాసిన వేళ మాత్రం తెల్పుచు వ్రాయండి. 12 నెలలకు మీ జీవిత ఫలితాలు వ్రాసి రు. 3-75 లకు వి. పి. ఉత్తరం ద్వారా పంపబడును. పోస్టేజి అదనం. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయండి.

M/s. Victoria Commercial Co.,
(APW.L|II)
AMBALA CANTT. (N. INDIA)
Pin 133001

